వెతలు తీర్చిన వంతెన



పసుపుగెడ్డపై నూతనంగా నిర్మించిన వంతెన



ఇది కదా అభివృద్ధి

వానొచ్చినా, వరదొచ్చినా పొంగి ప్రవహించే చీడిపల్లి పసుపుగెడ్డ దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వచ్చేది. దశాబ్దాలపాటు వెంటాడుతున్న ఈ వెతలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. రోడ్డు వంతెన నిర్మించడంతో నిన్న వచ్చిన మిచాంగ్ తుపానులోనూ యథావిధిగా రాకపోకలు సాగాయి.



వంతెన నిర్మించకముందు పసుపుగెడ్డ(ఫైల్)



వంతెనపై నిర్మించిన తారురోడ్డు

- దశాబ్దాల తర్వాత పసుపుగెడ్డపై రోడ్డు వంతెన నిర్మాణం
- అర్జునగిరి – చీడిపల్లి గ్రామాలకు తొలగిన కష్టాలు
- గత టీడీపీ హయాంలో ఎర్త్ వర్కుకే పరిమితం

చీడికాడ: మండలంలో అర్జునగిరి – చీడిపల్లి మధ్య రెండు మాసాల క్రితం వరకు మట్టిరోడ్డు ఉండేది. వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల మధ్య రాయబంద కళ్లాలకు చేరుకోవాలంటే పసుపుగెడ్డ దాటడం కష్టంగా ఉండేది. దీంతో 70 కుటుంబాలకు చెందిన రైతులు తురువోలు మీదుగా ఎనిమిది కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి వచ్చేది. వ్యవసాయ ఉత్పత్తులను కళ్లాలకు చేర్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. చీడిపల్లితోపాటు శివారు గ్రామాలు ఎస్.కొత్తూరు, నీలంపేట ప్రజలు చోడవరం వెళ్లాలంటే గతంలో తురువోలు మీదుగా వెళ్లాల్సి వచ్చేది. తాజాగా రోడ్డు వంతెన పూర్తి కావడంతో వీరితో పాటు దేవరాపల్లి మండలం వాకపల్లి గ్రామస్తులకు దూరాభారం తగ్గింది. ఇదే రోడ్డుకు గత టీడీపీ హయాంలో ఎర్త్ వర్కు చేసి కాంట్రాక్టర్ విడిచి పెట్టడంతో ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాంకేతిక ఇబ్బందులను తొలగించి రూ.2.02 కోట్లతో పూర్తి చేసింది.

తుపానులొచ్చినా భయం లేదు



మా పెద్దల కాలం నుంచి పసుపుగెడ్డ మీద వంతెన నిర్మించాలని ఎంతోమంది నాయకులకు మొర పెట్టుకున్నాం. ఇంతవరకూ ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దాంతో పసుపు గెడ్డకు వరదొస్తే తురువోలు మీదుగా కళ్లాలకు చేరుకోవాల్సి వచ్చేది. రోజుల తరబడి వరద తగ్గే వరకు కళ్లాల్లోనే వంటలు చేసుకునే వాళ్లం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మా కష్టాలకు మోక్షం కలిగింది. రోడ్డు వంతెన పూర్తి చేయడంతో మిచాంగ్ తుఫాన్‌లోనూ ధైర్యంగా కళ్లాలకు రాగలిగాం.

– అద్దెపల్లి ఉపేంద్ర, యువరైతు, అర్జునగిరి

వంతెన నిర్మాణంతో తొలగిన కష్టాలు



నా చిన్ననాటి నుంచి ఏ చిన్న పనికి చోడవరం వెళ్లాలన్నా పసుపు గెడ్డ దాటాల్సి వచ్చేది. వర్షాకాలంలో ఈ గెడ్డలో నీటి ఉధృతికి దిగలేక తురువోలు మీదుగా చోడవరం వెళ్లేవారం. అర్జునగిరి సచివాలయం ఏర్పడిన తర్వాత అక్కడికి వెళ్లాలన్నా ఇప్పటి వరకు ఇబ్బందులు పడుతూనే వచ్చాం. వంతెన నిర్మాణంతో ఆ కష్టాలు తొలగిపోయాయి. చాలా సంతోషంగా ఉంది.

– వేచలపు దేముడుబాబు, రైతు, చీడిపల్లి గ్రామం

క్లుప్తంగా

ప్రభుత్వ భూమి విక్రయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాకవరపాలెం: ప్రభుత్వ భూమిని విక్రయించడంపై చర్యలు తీసుకోవాలని మాకవరపాలేనికి చెందిన రుత్తల నారాయణరావు కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశాడు. ఇక్కడ సర్వే నంబర్ 172/3కు సంబంధించి స్థలంలో మండల పరిషత్‌కు చెందిన వీడీవో క్వార్టర్ ఉండేదని, దాన్ని గురుమూర్తి ఆక్రమించేందుకు ప్రయత్నించగా, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా నిర్ధారించారన్నారు. ఆ వెంటనే రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారన్నారు. ఈ భూమిని సదరు వ్యక్తి విక్రయించడంతో కొనుగోలుదారు రమణ కట్టడాలు ప్రారంభించాడన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడి, క్రయ విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

క్షయపై అవగాహన తప్పనిసరి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

చీడికాడ: హెచ్ఐవీ, సుఖ వ్యాధులు, క్షయ పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జోనల్ సూపర్‌వైజర్ టి.చంద్రశేఖర్ తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో అర్జునగిరిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 40 మందికి రక్తపరీక్షలు చేశారు. మెడికల్ ఆఫీసర్ డి.మంజుషా, రిసోర్స్ పర్సన్ గోవింద్, ఎం.ఎల్.హెచ్.పి స్వామి, సర్పంచ్ బి.రమాదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల నోటిఫికేషన్ రద్దు

రావికమతం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి రావికమతం మండలంలోని తట్టబంద, మర్రివలస అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుల భర్తీ కోసం ఇటీవల వెలువడిన ప్రకటన రద్దు అయినట్టు సీడీపీవో ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. కలెక్టర్ వీటిని రద్దు చేశారని, తదుపరి వివరాలను త్వరలో తెలియజేస్తామన్నారు.

చెరువులో మునిగి రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

మాకవరపాలెం: జి.గంగవరం చెరువులో మునిగి రెండు పాడిగేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన సబ్బవరపు గోవిందకు చెందిన రెండు గేదెలు ఎప్పటిలాగే గ్రామ సమీపంలో చెరువు వద్దకు మేతకు వెళ్లాయి. అక్కడ నీటి కోసం దిగడంతో మునిగిపోయి మృతి చెందాయి. దాంతో సదరు రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ఒక్కో గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని వాపోయాడు.

సీఐ ఆధ్వర్యంలో తుప్పల తొలగింపు

రావికమతం: కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో కొత్తకోట–కన్నంపేట రోడ్డులో ప్రమాదకరంగా మారిన తుప్పలను, ముళ్లకంచె తొలగింపు చర్యలు చేపట్టారు. కొంత కాలంగా కురిసిన వర్షాలకు ఇక్కడ రహదారికిరువైపులా తుప్పలు కప్పేయడంతో వాహనదారులు రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల వద్ద ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ నేపథ్యంలో ఎస్ఐ లక్ష్మణమూర్తితో కలిసి ఆయన సోమవారం కూలీలతో తొలగించారు.

గౌరీశ్వరునికి లక్షపత్రి పూజ

చోడవరం: స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి వారికి లక్షపత్రి పూజ, రథోత్సవం కనుల పండువగా జరిగింది. పవిత్ర కార్తీకమాసం నాల్గో సోమవారం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నాగాభరణం అలంకరించుకున్న నందివాహనంపై స్వామివారు పట్టణ పురవీధుల్లో ఊరేగారు. శివమాలధారణ భక్తులు భజనలు చేశారు. రాత్రికి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు.

పలువురికి ప్రభుత్వ విప్ పరామర్శ



మాజీ సర్పంచ్ చెల్లంనాయుడు ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

రోలుగుంట: కొమరవోలులో మాజీ సర్పంచ్ గొర్లె చెల్లంనాయుడు, రోలుగుంటలో కో–ఆపరేటివ్ బ్యాంకు ప్రెసిడెంటు చెట్టుపల్లి వెంకట్రావు అనారోగ్యానికి గురై వైద్య సేవలు పొందుతూ ఇళ్లలోనే ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం ఆయా గ్రామాలకు వెళ్లి వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా వడ్డాదిలో సాధికార బస్సుయాత్రకు సంబంధించి స్వాగత ఏర్పాట్లు, రోలుగుంట పాత రామ మందిరం వద్ద నిర్వహించనున్న పార్టీ మండలం నాయకులతో సమీక్ష, విలేకరుల ప్రెస్‌మీట్ ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వహణ కమిటీకి పలు సూచనలు చేశారు. అందరూ సమష్టిగా పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, మండల కన్వీనర్ మద్దు అప్పలనాయుడు తదితరులకు సూచించారు.

నేడు వడ్డాదిలో బహిరంగ సభకు సర్వం సిద్ధం



బహిరంగ ప్రదేశంలో కటౌట్ల ఏర్పాట్లు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో సామాజిక సాధికారిక బస్సుయాత్ర బహిరంగ సభ నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చొక్కాకుల వెంకటరావు, మండల ఇన్‌చార్జి గేదెల శేషులతో కలిసి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇక్కడ బస్సు యాత్ర, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. కొమ్మళ్లపూడి, బుదిరెడ్లపాలెం, పీడీ పాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్.బి.పురం, వడ్డాది వరకు దారి పొడవునా స్వాగత కటౌట్లు ఏర్పాటు చేశారు. సభా వేదిక చుట్టూ బెలూన్లు, నాయకుల చిత్రాలతో కూడిన కటౌట్లు ఏర్పాటు చేసి అందంగా ముస్తాబు చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వడ్డాది కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి కె. అచ్చింనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు ఏర్పాట్లు చేస్తున్నారు. రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు, ఎంపీలు, తదితర నాయకులు హాజరు కానున్నారని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఎస్పీ కె.వి. మురళీకృష్ణ డీఎస్పీ వి. సుబ్బరాజు, సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, ఎస్ఐ కె. కుమారస్వామి సభా వేదిక ప్రదేశాన్ని పరిశీలించారు. వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మార్కెట్ యార్డుతోపాటు హైస్కూల్ ఎదురుగా ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రావికమతం: మండలంలో మంగళవారం నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రకు సర్వం సిద్ధమైంది. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు రెండు రోజులుగా కార్యకర్తలను సమీకరించడమేగాక స్వాగత కటౌట్లు, బ్యానర్లు, ఆర్చిలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి భరోసా సీఎం సహాయనిధి

రూ.2.90 లక్షల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గణేష్



చెక్కులు అందుకున్న బాధితులతో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నియోజకవర్గంలోని ఐదుగురికి సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. గొలుగొండ మండలం గుండుపాలకు చెందిన మర్రి రామకృష్ణకు రూ.1.15 లక్షలు, ఏఎల్.పురానికి చెందిన యర్రంశెట్టి చినబుజ్జికి రూ.50 వేలు, చింతల మురళికి రూ.45 వేలు, ఎటిగైరంపేటకు చెందిన గుడివాడ సత్యనారాయణకు రూ.26 వేలు, కొత్తమల్లంపేటకు చెందిన సింగంపల్లి సన్యాసమ్మకు రూ.54 వేల చొప్పున మొత్తం వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.90 లక్షలు మంజూరైంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల యూత్ నాయకుడు మాకిరెడ్డి రామకృష్ణంనాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కల్పనకు పనుల గుర్తింపు



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: జాబ్‌కార్డుదారులకు ఉపాధి కల్పించేలా పనులు గుర్తించాలని సంబంధిత అధికారులను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు కోరారు. సోమవారం బోయిలకింతాడలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి పనులు గుర్తింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. వేసవిలోనూ కూలి గిట్టుబాటయ్యే పనులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు దండే జాన్ విక్టర్, మండల వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ అన్నం రామునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు అన్నం సాంబమూర్తి, కొప్పాక శంకరరావు, బొబ్బిలి రాము పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీతకు ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు

బ్రోచర్‌లను ఆవిష్కరించిన ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: ఆడుదాం.. ఆంధ్రా పోటీలతో క్రీడాకారుల్లో నిక్షిప్తమైన ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. పోటీల నిర్వహణ సమయాల్లో వెబ్ స్కోరింగ్ నమోదు చేసే విధానంపై ఫిజికల్ డైరెక్టర్లు అవగాహన కల్పించారు. ముందుగా ఈ పోటీల బ్రోచర్‌ను ఎంపీపీ విడుదల చేశారు. ఎంపీటీసీలు చీపురుపల్లి అచ్చిబాబు, వర్రి రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, ఆడుదాం..ఆంధ్రా పోటీల మండల కోఆర్డినేటర్ లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

క్రీడాకారుల చక్కటి అవకాశం ‘ఆడుదాం ఆంధ్రా’

నాతవరం: గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు చక్కటి అవకాశమని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆయన సమీక్షించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఈ పోటీలను బాధ్యతగా నిర్వహించాలన్నారు. వీటిని విజయవంతం చేసే దిశగా క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



ఈవీఎంలో మహిళలతో నమూనా ఓటు వేయిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఎలక్ట్రానింగ్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మొబైల్ వాహనాన్ని ఆర్డీవో సోమవారం ప్రారంభించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంలు వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు మొబైల్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంలు పని చేస్తున్న తీరుపై తమ సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. ఓటరు ఎవరికైతే ఓటు వేశారో స్పష్టంగా ఈవీఎంలో కనిపిస్తుందన్నారు. ప్రజల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నామన్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో ఓటు వేయటంపై అవగాహన కలిపంచారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్నాజీరావు, ఆర్ఐ వెంకటలక్ష్మి, ఎలక్షన్ డీటీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

రావికమతం: అప్పలమ్మపాలెంలో రెండు లీటర్ల సారాతో ములకలాపల్లి అప్పారావును అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేయగా రెండు లీటర్ల సారాతో పట్టుబడ్డాడన్నారు.

ఏఎల్ పురంలో పూరిల్లు దగ్ధం

గొలుగొండ: ప్రమాదవశాత్తు పూరిల్లు కాలిపోవడంతో ఒక కుటుంబానికి నిలువ నీడ లేకుండా పోయింది. సోమవారం తెల్లవారుజామున ఏఎల్ పురం గ్రామానికి చెందిన వై. సత్తిబాబు పూరింట్లో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు వచ్చి వాటిని అదుపు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇంట్లో లక్ష విలువ చేసే నిత్యావసర సరుకులు, సామగ్రి కాలిపోయాయి. స్థానిక రెవెన్యూ అధికారులు పరిశీలించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

‘జగనన్నకు చెబుదాం’కు 18 అర్జీలు

నర్సీపట్నం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన)కు వివిధ సమస్యలపై 18 అర్జీలు వచ్చాయి. వీటిని ప్రజల నుంచి ఆర్డీవో హెచ్.వి.జయరాం స్వీకరించారు. మాకవరపాలెం మండలం వజ్రగాడకు చెందిన గుడివాడ చినబాబు మ్యూగేటన్‌కు దరఖాస్తు చేశాడు. మల్లవరానికి చెందిన సంబంగి శ్రీరాములు వెబ్‌ల్యాండ్‌లో పేరు మార్పుకు అర్జీ పెట్టుకున్నాడు. నాతవరం మండలానికి చెందిన తంతార కోటేశ్వరి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకానికి సచివాలయ సిబ్బంది రూ.10 వేలు కట్టించుకొని హక్కు పత్రం ఇవ్వలేదని ఫిర్యాదు చేశాడు. కోటవురట్ల మండలం కొడవటిపూడికి చెందిన పెంటకోట పెదలక్ష్మి, జి.భవాని, వి.మంగ, వై.కుమారి, ఎస్.లక్ష్మితోపాటు 96 మందిమి జగనన్న ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకొని 500 రోజులు గడుస్తుందని, స్థలాలు ఇప్పించాలని కోరారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన పోడు సాగుదారులు పట్టాలు ఇప్పించాలని దరఖాస్తు పెట్టుకున్నారు. ఈటిని పరిశీలించి న్యాయం చేస్తామని ఆర్డీవో తెలిపారు. తహసీల్దార్ అన్నాజీరావు, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, సీడీపీవో మేరీ సువార్త, విద్యుత్‌శాఖ ఏడీ సత్యానందం, ఇరిగేషన్ ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చేలా సీఎం పాలన

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై విస్తృత ప్రచారం



మాడుగుల: వీరనారాయణంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న రాజారామ్, కొండలరావు తదితరులు



గొలుగొండ: ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న నాయకులు

కె.కోటపాడు: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వారాడలో సోమవారం ఆయన సంక్షేమ, అభివృద్ధికి సంబంధించి ఫ్లెక్సీని ఆవిష్కరించారు. జగన్‌కు ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉండాలని కోరారు. సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, ఉప సర్పంచ్ చిరికి గోవింద, చీపురపల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: కొత్తమల్లంపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ పోలిరెడ్డి రాజుబాబు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. వీటికి సంబంధించి ఫ్లెక్సీని ఆవిష్కరించారు. మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణిశాంతారామ్ పాల్గొన్నారు.

మాడుగుల: వీరనారాయణంలో సంక్షేమ, అభివృద్ధికి సంబంధించి ఫ్లెక్సీని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ ఆవిష్కరించారు. సంక్షేమ ఫలాలు గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారపు రామారావు, సీఈవో సత్తిబాబు, ఎంపీటీసీ దాడి నూకత్నం పాల్గొన్నారు.

దేవరాపల్లి: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. స్థానిక సచివాలయం–2లో సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును, పార్టీ జెండాను బాబూరావు ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రాత్రికి అక్కడే భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాలిబాబు పాల్గొన్నారు.